బాధిత కుటుంబానికి పరామర్శ

సాంబశివరావు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సండ్ర

సత్తుపల్లి, ఫిబ్రవరి 5: తల్లాడ మండలం వెంగన్నపేట పంచాయతీ గూడూరు గ్రామానికి చెందిన కళ్యాణపు సాంబశివరావు బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వారి స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. వారి వెంట మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, కేతినేని చలపతిరావు, మాజీ సర్పంచ్ మువ్వా మురళీధర్‌రావు ఉన్నారు.

'ఐబీఎంతో ఎస్‌బీఐటీ అవగాహన ఒప్పందం'

ఒప్పంద పత్రాలు చూపిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 5: ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల యాజమాన్యం సీఎస్ఆర్ బాక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఐబీఎంతో నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్‌బీఐటీ – ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎస్‌బీఐటీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలు ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల ఓరియెంటేషన్‌లో మాట్లాడారు. ఐబీఎం సంస్థ ఒప్పందం ద్వారా రానున్న మూడేళ్లపాటు విద్యార్థులకు పలు కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జీ.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మజీద్‌పాషాకు అభినందన

మజీద్‌పాషాను అభినందిస్తున్న పోలీస్ కమిషనర్

పెనుబల్లి, ఫిబ్రవరి 5: ఇటీవల జరిగిన మూడవ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో మండలంలోని వీ.ఎం.బంజర పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.కే.మజీద్‌పాషా షార్ట్‌పుట్ విభాగంలో బంగారు పథకం సాధించాడు. ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ మజీద్‌పాషాను అభినందించారు. అదేవిధంగా వీ.ఎం.బంజర ఎస్సై కే.వెంకటేష్, సత్తుపల్లి రూరల్ సీఐ ఎం.ఎల్.ముత్తి లింగయ్య మజీద్‌పాషాను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 5: అదనపు కట్నం కోసం వేధించి మహిళను చంపిన భర్తకు, అత్తకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమాన విధిస్తూ ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ముదిగొండ మండలం బాణాపురం తండా గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తేజావత్ ఉపేందర్‌కు, సూర్యాపేటకు చెందిన కల్యాణికి 2017 మే 18న పెద్దలు వివాహం జరిపించారు. ఈ క్రమంలో వారు ఒక ఏడాదిపాటు మంచిగానే కాపురం చేశారు. వారికి ఒక పాప పుట్టింది. అప్పటి నుంచి నిందితుడైన ఉపేందర్ ప్రవర్తనలో మార్పువచ్చింది. కల్యాణిని కూడా అదనపు కట్నం కోసం వేధించసాగాడు. దీనికి అతడి తల్లి పద్మ కూడా సహకరించింది. అదేవిధంగా నిందితుడైన ఉపేందర్ వేరే మహిళతో కూడా వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ నేపథ్యంలో కల్యాణి తల్లితండ్రులు 30 కుంటల భూమిని విక్రయించి అతడికి మూడు దఫాలుగా రూ.12 లక్షలు ఇచ్చారు. అయినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. 2020 ఫిబ్రవరి 12న తండా వాసులు కల్యాణి తల్లితండ్రులకు ఫోన్‌చేశారు. కల్యాణిని అతడి భర్త హత్య చేశాడని చెప్పారు. దీంతో వారు వెంటనే వచ్చి చూడగా కల్యాణి ఇంటిలో విగతజీవిగా పడి ఉంది. ఆమెను పరిశీలించి చూడగా గొంతు కుడి భాగంలో రక్తస్రావంతో కూడిన గాయం, రెండు కాళ్లపై రక్తస్రావంతో కూడిన గాయాలు ఉన్నాయి. దీంతో కల్యాణి తల్లి భూక్యా కాళియా.. తన అల్లుడు ఉపేందర్‌నాయక్‌పైనా, అతడి తల్లి పద్మపైనా, మరో ముగ్గురిపైనా ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విని కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితులైన ఉపేందర్, అతడి తల్లి పద్మపై నేరం రుజువైందని భావిస్తూ పైవిధంగా తీర్పుచెప్పారు. మిగతా నిందితులపై నేరం రుజువుకాకపోవడంపై వారిని విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్ వాదించారు. వారికి లైజన్ ఆఫీసర్లు శ్రీకాంత్, రఫీద్, డీ.నాగేశ్వరరావు, హోంగార్డు ఎస్‌డీ యూసుఫ్ సహకరించారు.

మహిళా ప్రాంగణ నిర్వహణ అద్భుతం: కలెక్టర్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 5: మహిళలకు అందించే కోర్సుల్లో మంచి ఫలితాలను సాధిస్తున్న మహిళా ప్రాంగణాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. దాని నిర్వహణ పట్ల సదరు బాధ్యులను అభినందించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మహిళా ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొని అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ముందుగా ర్యాంకులను సాధించిన విద్యార్థినులు జే.పావని, ఎస్.మనీలాలను అభినందించారు. వారికి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా ప్రాంగణానికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానని మాట ఇచ్చారు. అనంతరం కలెక్టర్‌ను మహిళా ప్రాంగణాధికారి వేల్పుల విజేత శాలువాతో సత్కరించారు. మహిళా ప్రాంగణ ఉద్యోగులు నాగ సరస్వతి, స్పందన, హిమబిందు, మల్లిక, విజయ్‌కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, పల్లవి, దుర్గారావు, శాంతమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ అప్పగింత

మహిళను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఆర్కే ఫౌండేషన్ సభ్యులు, పోలీసులు

మధిర, ఫిబ్రవరి 5: ఓ మహిళ చనిపోయిందనుకొని వదిలేసిన కుటుంబంలో ఒక్కసారిగా ఆమె బతికి ఉందన్న సమాచారం తెలుసుకున్న కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. కొన్ని రోజుల క్రితం మధిర పట్టణంలో ఒక పెట్రోల్‌బంక్ వద్ద అనుమానాస్పదంగా ఒక మహిళ సంచరిస్తూ ఉండడంతో పెట్రోల్‌బంక్ సిబ్బంది మధిర పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోట్ కానిస్టేబుల్ బాణావత్ కొండ సదరు మహిళ వద్దకు వెళ్లి వివరాలు అడగ్గా ఏమీ చెప్పలేకపోయింది. ఆ మహిళకు మతిస్థిమితం లేదని గ్రహించి పోలీసులు ఆర్కే ఫౌండేషన్ వారికి తెలియజేసి అనాథ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి మహిళకు కొన్ని రోజులు సపర్యలు చేసి మహిళ వివరాలు అడగ్గా ఖమ్మం అని చెప్పడంతో ఆ దిశగా సోషల్ మీడియా ద్వారా బంధువుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. కానీ ఆ మహిళది ప్రకాశం జిల్లా కంభం దగ్గర కావడంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించి సోషల్ మీడియాకు తెలిపారు. వెంటనే సోషల్‌మీడియాలో వచ్చిన వీడియోను చూసి కుమారుడు, కుమార్తె తమ తల్లి బతికే ఉందని ఆనందం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడి పోలీసులు వారి సహకారంతో మధిర పట్టణంలో ఆర్.కే.ఫౌండేషన్ అనాథ ఆశ్రమం వద్దకు వారి కుటుంబ సభ్యులు వచ్చారు. 60 ఏళ్ల వయస్సు గల మెగావత్ రూప్లే భాయ్‌ని చూసి ఆనందంతో కన్నీటి పర్వంతమయ్యారు. మధిర పట్టణ ఎస్సై సంధ్య సమక్షంలో కానిస్టేబుల్ తమ్మిశెట్టి శ్రీనివాసరాజు రూప్లేభాయ్‌ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చేతిరాత.. అందరి మన్ననలు పొందాలి

శిక్షణ ఇస్తున్న చేతిరాత నిపుణులు రమేష్

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 5: అక్షరాలు అందంగా రాయడం నేర్చుకుంటే అందరి మన్ననలు పొందవచ్చని తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల శిక్షణ ఇస్తున్న ప్రముఖ చేతిరాత నిపుణుడు నిస్పంపల్లి రమేష్ అన్నారు. బుధవారం విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల్లో చేతిరాత మెరుగుపర్చుకునేందుకు అవగాహన కల్పించారు. రాసేటప్పుడు పెన్, పేపర్ పట్టుకునే విధానం వివరించారు.

కరాటే విజేతకు అభినందన

రెండు రోజుల క్రితం ఖమ్మంలో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రశంసాపత్రం పొందిన బొర్రా మన్విత్‌ను ఈ సందర్భంగా అభినందించారు. అతనికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పిచ్చయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. మన్విత్ విశ్వశాంతిలో 6వ తరగతి చదువుతున్నాడు. కార్యక్రమంలో విశ్వశాంతి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి ఘటించిన సినీ నటులు

కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబసభ్యులు

సినీనిర్మాత కే.పీ.చౌదరికి నివాళి

మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సినీ నటులు, కుటుంబ సభ్యులు

బోనకల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన సినీ నిర్మాత బోడేపూడి కృష్ణప్రసాద్‌చౌదరి(కే.పీ.చౌదరి) సోమవారం గోవాలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం పాఠకులకు వేధితమే. ఆత్మహత్యకు పాల్పడిన కే.పీ.చౌఐదరి మృతదేహాన్ని బుధవారం తెల్లవారుజామున వారి బంధువులు గోవా నుంచి స్వగ్రామమైన రాయన్నపేట తీసుకొచ్చారు. తల్లి విజయ, భార్య సాహిష్ణినోసిల్ ఆయన మృతదేహం చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న సినీనటిమణులు హేమ, సురేఖవాణి, జ్యోతి, బాలతో పాటు, టీవీ ఆర్టిస్టులు, సినీ పరిశ్రమకు చెందిన నటుల కుటుంబసభ్యులు ఆయన స్వగృహానికి వచ్చి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామంలో ఆయన చివరి చూపుగా చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలతో పాటు, బంధువులు, తరలివచ్చారు. మృతుడి కుమారుడు కార్తీకేయ తన తండ్రి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కే.పీ.చౌదరి అంతిమయాత్రలో సినీనటులు బోరున విలపిస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌కు సన్మానం

వైరాటౌన్, ఫిబ్రవరి 5: వైరా మున్సిపాలిటీ 13వ వార్డు గాంధీనగర్‌లోని శ్రీసాయి గజానన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు దంపతులను సన్మానించారు. వూరుకొండ శ్రీనివాసరావు, ముళ్ళపాటి రంగారావు, కొమిరిశెట్టి శ్రీధర్, వేమిరెడ్డి రామశేషారెడ్డి, వెలిశెట్టి నర్సింహారావు, చేడే సుధాకర్, రామిశెట్టి శ్రీనివాసరావు, రాయల ప్రసాదరావు, రాయల కాంత్, కటకం శివకృష్ణ, కొమిరిశెట్టి పుష్పావతి, వెలిశెట్టి అపర్ణ, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ముదిగొండ, ఫిబ్రవరి 5: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పోలీసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అవగాహన కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాస్, వీరు తదితరులు పాల్గొన్నారు.

జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ చంద్రశేఖర్

మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న డీఎస్ఎస్ఏ చంద్రశేఖర్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని రామన్నపేటలో ఉన్న జిల్లా జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) సెక్రటరీ చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. జిల్లా జైల్ పర్యవేక్షణ అధికారి శ్రీధర్‌తో కలిసి జైలులోని పలు విభాగాలను సందర్శించారు. బ్యారక్‌లలో ఉంటున్న ఖైదీల బాగోగులు, వారి కేసులకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీల నైపుణ్యత అభివృద్ధిలో భాగంగా సత్యమార్గం యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పేపర్ బ్యాగు తయారీ శిక్షణ తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో సత్యమార్గం యూత్ సర్వీసెస్ బాధ్యులు శ్రీలక్ష్మి, జైలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

మల్లికార్జున్‌రెడ్డిని పరామర్శిస్తున్న లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 5: మండలంలోని మీనవోలు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుడుమల మల్లికార్జున్‌రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ శీలం కవిత, నాయకులు శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారావు, తిరుపతిరావు, తోట శ్రీనివాసరావు, స్టాలిన్, హుస్సేన్, అప్పారావు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే

సీఎంకు వినతిపత్రం విస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 5: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలోని కల్లూరు మండల కేంద్రంలో ఫైర్‌స్టేషన్, నూతన పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పెద్దాసుపత్రి కార్మికుల సమ్మె విరమణ

వార్డులను శుభ్ర పరుస్తున్న కేఎంసీ కార్మికులు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 5: పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ మూడు రోజులుగా జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. వారి ఆందోళన కారణంగా దవాఖాన, వైద్య సేవల నిమిత్తం వస్తున్న రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వార్డుల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధభరితంగా మారాయి. దుస్థితిని తెలుసుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యను రంగంలోకి దింపారు. దీంతో కేఎంసీ పారిశుధ్య కార్మికులను తీసుకొచ్చి దగ్గరుండి వార్డులను శుభ్రం చేయించారు. ఈ క్రమంలో పెద్దాసుపత్రికి చెందిన కార్మికులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వారించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ శాంతించకపోవడంతో ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు కార్మికులతో చర్చించారు. ఈ నెల 10 వరకు మూడు నెలల వేతనం మంజూరుచేయించగలనని అన్నారు. తనపై నమ్మకముంచి విధుల్లో చేరాలని కోరారు. ఆయన హామీతో శాంతించిన కార్మికులు.. తాము చేస్తున్న సమ్మెను విరమించినట్లు ప్రకటించారు.

ఆస్తిపన్ను లక్ష్యాన్ని సాధించాలి

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారావు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 5: ఈ ఆర్థిక సంవత్సరం మున్సిపాలిటీ ఆస్తిపన్ను లక్ష్యాన్ని సాధించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్రు నరసింహారావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొండిబకాయిల జాబితాను సిద్ధం చేయాలని, తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని తెలిపారు. పారిశుధ్య చర్యలను మెరుగుపర్చాలని స్పష్టం చేశారు. సమావేశంలో మేనేజర్ మైసా శ్రీనివాసరావు, ఆర్ఐ లోకేష్, ఏఈ సురేష్, వార్డుఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి బ్రెయిన్‌స్ట్రోక్

బోనకల్లు, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి ఎం.రాధాకృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యానికి గురయ్యారు. ఖమ్మంలో ఉంటున్న రాధాకృష్ణ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ల పరిశీలన డ్యూటీ ఖమ్మంలో ఉండగా మంగళవారం రాత్రి ఒక్కసారిగా బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురికావడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, పంచాయతీ కార్యదర్శులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **MAREBOINA PADMA** (OLD NAME) W/o. **SRINIVASA RAO** R/O. H.No.9-1-173/2B, Prashanthi Nagar, Laxmidevipalli Mandal, Bhadradri Kothagudem District, Telangana, Hereby changed my name as **P.PADMA** (NEW NAME) W/O. **SRINIVASA RAO** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శివాలయం హుండీ లెక్కింపు

మధిర, ఫిబ్రవరి 5: పట్టణంలోని మున్నేరు సమీపంలోని మృత్యుంజయస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. హుండీలో భక్తులు వేసిన కానుకలు రూ.1,19,417 వచ్చినట్లు ఆలయ ఈవో జగన్మోహన్‌రావు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,11,116 విరాళం

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలోని ద్వారకాపురి 7వ లైన్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి నరుకుళ్ల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మమతగగన్ సాత్రిక్ తల్లిదండ్రులు రాములు, వెంకటమ్మ బుధవారం రూ.1,11,116ను బుధవారం విరాళంగా అందజేశారు. ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, మందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని జమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గద్దల కిరణ్, ముల్లంగి రమేష్ బుధవారం 8 డెస్క్ బెంచీలను అందజేశారు. ప్రస్తుతం ముల్లంగి రమేష్ ఇండియన్ ఆర్మీలో పనిచేస్తుండగా గద్దల కిరణ్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సునందు పనిచేస్తున్నారు. ముల్లంగి లాజర్, గద్దల కిశోర్, గద్దల రాజశేఖర్, మేసీపోగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ, ట్రాక్టర్ సీజ్

బోనకల్లు, ఫిబ్రవరి 5: అనుమతులు లేని ట్రాక్టర్, లారీతో పాటు, మరో వాహనాన్ని వైరా ఆర్డీవో వరప్రసాద్ పట్టుకొని సీజ్ చేశారు. బుధవారం బోనకల్లు– మధిర క్రాస్‌రోడ్డులో వైరా ఆర్డీవో వరప్రసాద్ తనిఖీలు చేపట్టారు. బ్రేక్ ఇన్సూరెన్స్‌తో పాటు, అనుమతి పత్రాలు లేని వాహనాలను తనిఖీల్లో గుర్తించారు. ట్రాక్టర్, లారీతో పాటు, మరో వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం

వైరాటౌన్, ఫిబ్రవరి 5: మండలంలోని రెబ్బవరం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నర్సింహారావు సొంత ఖర్చులు రూ.8వేలతో 200 మంది విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం చివరి వరకు మినరల్ వాటర్ అందించే విధంగా తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తులశమ్మ, ఉపాధ్యాయులు వెంకట్రావు, శ్రీనివాసరావు, సూర్యప్రకాశరావు, కిరణ్, లలిత, సరస్వతిలు, ఉపాధ్యాయులు నర్సింహారావు అభినందించారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని కాకరవాయిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చలో హైదరాబాద్‌కు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గొర్రెపాటి రమేశ్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను, లింగయ్య, సత్యం, నగేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల లబ్ధి కోసమే కేంద్ర బడ్జెట్

నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుబల్లి, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ కాగితాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. బడ్జెట్ నిరుపేదలకు కాదని, అంబానీ, ఆదానికి లక్షల కోట్లలో ప్రజల సొమ్మును దోచి పెడతారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా జీరో చేయడం దారుణమన్నారు. చలమాల నరసింహారావు, నల్లమల అరుణప్రతాప్, చిలక రామచంద్ర, ఆంబోజు బుడ్డయ్య, మిద్దెస్వామి, కడియం రాజు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 5: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తాళ్లమడ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మున్సిపాలిటీలోని వెంగళరావునగర్‌కు చెందిన ఎస్.కే.షాజహాన్, ఎస్.కే.ఆసీఫ్ అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వస్తుండగా అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న లారీ మండలంలోని తాళ్లమడ గ్రామ శివారులో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టూవీలర్‌పై వెనుక ఉన్న ఎస్.కే.షాజహాన్(35) అక్కడికక్కడే మృతిచెందగా ఆసీఫ్‌కు తీవ్రగాయాలు కావడంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షాజహాన్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఎ.రఘు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

బావిలో పడి రైతు మృతి

వైరాటౌన్, ఫిబ్రవరి 5: వైరా మండలం వల్లాపురం గ్రామంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు పొలానిక